ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 07 మే , 2025 | పేజీలు : 06

## రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం

### అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిలో భాగంగా మండలంలోని రహీంఖాన్ పేట, రాఘవాపురం గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ యొక్క భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని, సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లావణ్య, డిప్యూటీ తహసిల్దార్ సఫీయుద్దీన్, గిరిదవరి మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, పాండు తదితరులు పాల్గొన్నారు.



# ఆటవికంగా మాట్లాడొద్దు

## కేంద్రమంత్రి బండి సంజయ్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్ర-జాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటిస్తే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చర్చలు లేవు కాల్చి చంపుతామని ఆటవిక న్యాయాన్ని అమలు చేసే విధంగా మాట్లాడటం సరైందికాదని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్సి నెలికంటి సత్యం విమర్శించారు. నల్లగొండ పట్టణ,మండల 15వ మహాసభ మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం, మగ్దూం భవన్‌లో జరిగింది.మహాసభకు ఎంఎల్సి సత్యం ముఖ్యతిధిగా హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు పేద ప్రజలపై అన్ని రకాల ధరలు పెంచుతూ కార్పొరేట్ శక్తులకు,పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ దేశాలలో చమర ధరలు తగ్గుతున్నప్పటికీ భారతదేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నెలవారీగా పెంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధం గా ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అకాల వర్షం వల్ల రైతుల పంట తోటలు,పంటలు విపరీతంగా దెబ్బతింటున్నాయని ప్రభుత్వ వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే జరిపి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడుతున్న సిపిఐ పార్టీని బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పట్టణంలో పేద ప్రజలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని అదేవిధంగా వివిధ ప్రాంతాలలో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులకు ఇండ్ల పట్టా స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ నల్లగొండ పట్టణ ప్రజలకు అందిస్తున్న తాగునీరు ఉదయ సముద్రం సామర్థ్యాన్ని పెరుగుతున్న జనాభాకు ఆధారంగా 1.5 టిఎంసిల నుంచి 3 టిఎంసిల వరకు సామర్థ్యాన్ని పెంచాలని కోరారు.ఈమహాసభకు సిపిఐ నాయకులు కేవీఎస్ రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా కార్యవర్గ సభ్యులు బలుగూరి నరసింహ, పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్ నాయకులు ముండ్ల ముత్యాలు,వి లెనిన్,ఎస్.కె మదర్,రేవెల్లి యాదయ్య, గుండె రవి,కోమటిరెడ్డి ప్రద్యుమారెడ్డి,పుట్టల సుజాత,ఎం కౌసల్య,జె విజయ పాల్గొన్నారు.





## కాలుజారి బావిలో పడి బాలుడు మృతి

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామంలో బావి వద్ద స్నానానికి వెళ్లిన బాలుడు కాలుజారి అందులో పడి మృత్యువాత పడ్డాడు. వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి గ్రామానికి చెందిన బట్టు సుధాకర్ చిన్న కుమారుడు బట్టు చరణ్ 12 సం (పుట్టుకతోనే మూగ చెవిటి) అతని సోదరుడి కుమారుడు గౌతమ్‌తో కలిసి సోమవారం 5వ తేదీన తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద స్నానం చేయడానికి వెళ్లారు. ఇద్దరికి ఈత రాకపోవడంతో బావి ఒడ్డున స్నానం చేస్తున్న సమయంలో అతని కుమారుడు చరణ్ ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మునిగిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఇది చూసిన అతని సోదరుడి కుమారుడు గౌతమ్ ఇంటికి వచ్చాడు కానీ భయంతో జరిగిన విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఎంతకీ చరణ్ ఇంటికి రాకపోవడంతో గౌతమ్ ను ప్రశ్నించిన తల్లిదండ్రులకు సాయంత్రం జరిగిన విషయాన్ని తెలిపాడు. అనంతరం గ్రామస్తులతో కలిసి వ్యవసాయ బావి వద్ద మోటార్ సాయంతో నీటిని తొలగిస్తుండగా మంగళవారం ఆరవ తేదీన ఉదయం 5:30కు చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.



## పిడుగుపాటుకు 2గేదెలు మృతి

**ప్రజాపక్షం/ మోటకొండూర్ :** మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన గుర్రాల కిష్టయ్యకు చెందిన రెండు బర్రెలు తన వ్యవసాయ బావి వద్ద రోజుమాదిరిగా చెట్టు క్రింద కట్టేసిన ఇంటికి వెళ్ళాడు. సోమవారం రాత్రి ఆకస్మికంగా వచ్చిన గాలివానతో పాటు పిడుగు పడి మరణించాయి ఆ గేదెల విలువ సుమారు 2 లక్షల పైన ఉంటాయి అని బాధిత రైతు కన్నీరు మున్నీరు అయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కిష్టయ్య కోరారు రెవిన్యూ అధికారులు, పశు వైద్యాధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.



## కుక్కల దాడిలో 11గొర్రెలు మృతి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని చాడలో మల్ల బాలనర్సయ్యకు చెందిన 11 గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



## ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/నిడమనూరు:** నిడమనూరు మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ (పాఠశా) కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి నిర్మల తెలిపారు. కళాశాలలో ఎంపీసీ,బైపిసి, ఎంఈసి, సిఇసి గ్రూ ప్పులలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రతి గ్రూప్ కి 40 సీట్లు ఉన్నందున మే 5 నుండి 20వ తేదీ వరకు ఆన్లైన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఎంపిక ఎస్ ఎస్ సి మెరిట్ ప్రభుత్వ రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా జరుగుతుందన్నారు. కళాశాలలో నీట్ ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు, నిపుణులచే కెరియర్ గైడెన్స్ కౌన్సిలింగ్, ల్యాబులు, క్రీడలు, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ తదితర ఎన్నో రకాల సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు స్కాలర్షిప్ సౌకర్యం ఉంటుందని ఈ సౌకర్యాన్ని పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

## రాజీవ్ యువ వికాసం అమలుపై మండల స్థాయి బ్యాంకర్ల సమావేశాలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రాజీవ్ యువ వికాసం పథకం అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక , బ్యాంకు లింకేజ్ ప్రక్రియలను సమీక్షించేందుకు జిల్లాలోని వివిధ మండలాలలో మండల స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల్లో పథకం జిల్లా సమన్వయకర్త టి.నాగిరెడ్డి పథకం మార్గదర్శకాలను వివరించి, ఎంపిక ప్రక్రియలో మండల అభివృద్ధి అధికారులు (ఎంపిడిఓలు) మరియు బ్యాంక్ మేనేజర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. దరఖాస్తులను పూర్తి స్థాయిలో యంపిడీఓలు , మున్సిపల్ కమీషనర్లు డెస్క్ వెరిఫికేషన్ పూర్తి చేసి వెంటనే సమర్పించాలని ఆయన సూచించారు. మే 10వ తేదీ నాటికి తాత్కాలిక లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జినుకల శ్యామ్ సుందర్ బ్యాంకులు ఎంపిడిఓలు మరియు మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పని చేసి, బ్యాంకులకు పంపిన జాబితాలను పరిశీలన చేసి, దిన సరి పరిశీలన పురోగతిని ఎంపిడిఓల ద్వారా ప్రధాన కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. భువనగిరి, బిబినగర్, బొమ్మలరామారం, పోచంపల్లి, తుర్కపల్లి, ఆలేరు, మోటకొండూర్, రాజపేట, యాదగిరిగుట్ట మండలాల ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, జిల్లా బీసీ మరియు మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీ యాదయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.శివరామకృష్ణ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.





## ఉపాధిహామీ పనులను ఎత్తివేయాలి చూస్తుంది

**ప్రజాపక్షం/మునగాల:** బిజేపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధిహామీ పనులను ఎత్తివేయాలి చూస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రాంపురం, నేలమర్రి, ఈదులవాగు తండా, తాడ్వాయి గ్రామాల్లో జై బాపు జై బీమ్ జై సంవిధాన్ లో ప్రతి గ్రామంలో ప్రతిజ్ఞ చేయించారు. ఆధ్వర్యంలో త్వరలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మాతంగి బసవయ్య, కాసర్ల కోటేశ్వరరావు, బచ్చు అశోక్, కాలే సామ్యేలు, మట్టయ్య, నలబోలు సతీష్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు తక్కెళ్లపాటి సాయి, షేక్ నాగుల్‌పాషా, గోపి, కోట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ ఇటీవల ఆకాలంగా మృతి చెందడం జరిగింది. దివంగత పోలీస్ సిబ్బంది కుటుంబాల అవసరాల తీర్చడంలో భాగంగా పోలీస్ చేయూత పథకం ద్వారా హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల పోలీస్ చేయూత పథకం కింద చెక్కును జిల్లా ఎస్పీ కె.నర్సింహా కుటుంబ సభ్యులకు అందజేశారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీస్ సిబ్బంది నుండి ప్రతినెల జీతం నుండి విరాళం అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచంద్రగౌడ్, వేల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, భరోసా సెంటర్ మహిళ ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత నాగయ్యకు సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మేడే సందర్భంగా హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వంచేత శ్రమశక్తి అవార్డు అందుకున్న కుక్కడం గ్రామానికి చెందిన నూకపంగ నాగయ్యను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. మున్ముందు కార్మికులకు, యాజమాన్యాలకు వారధిగా నిలుస్తూ కార్మికుల పక్షాన పోరాటం చేయాలని సూచించారు. సామా వెంకన్న, పరిక వెంకటేశ్వర్లు, రాములు, ఆంజనేయులు, విక్రమ్, పాండునాయక్, షేక్ అఫ్జల్, బొంగరాల శ్రీనివాస్, కృష్ణారెడ్డి, కందుల శ్రీనివాస్, గుండ్రెడ్డి బుచ్చిరెడ్డిలు పాల్గొన్నారు.



## డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** డ్రగ్స్ నిర్మూలన, డ్రగ్స్ వినియోగం వల్ల అనర్ధాల పై ప్రజల్లో, యువతలో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోరంట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్‌ను సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రస్తుత సమాజంలో యువత బాగా డ్రగ్స్ బారీన పడుతున్నారని, యువతను డ్రగ్స్ మహమ్మారీ నుండి రక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని కోరారు. ప్రభాకర్ విద్యార్థులకు విద్య నేర్పుతూ తనకున్న సమయాన్ని డ్రగ్స్ నిర్మూలన కోసం ఉపయోగిస్తున్నారని అన్నారు. ఎవ్వరు డ్రగ్స్‌ను వినియోగించవద్దని, డ్రగ్స్ వాడితే యువత భవిష్యత్‌ను కోల్పోతారన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి వాటిని సమాజం నుండి నిర్మూలించాలని కోరారు.

## ఉపాధి పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/మోతె:** ఉపాధి హామీ పనిచేస్తున్న ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని డిఆర్‌డిఓ అప్పారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హుస్సేనాబాద గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో నీడకు టెంట్‌తో పాటు మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కూలీలకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అదే విధంగా కూలీలకు రోజువారి వేతనం 300 రూపాయలు తగ్గకుండా వచ్చే విధంగా పనులను కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వన నర్సరీని సందర్శించి మొక్కలను రెండు పూటలు నీళ్లు కొట్టాలని, వన సేవకులకు సూచించారు. అదే విధంగా హరితహరానికి మొక్కలను సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎపీవో నగేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌమ్య, టిఎ, ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నారు.

## 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజేపి ప్రభుత్వం కార్పోరేట్ల ప్రయోజనం కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి రోజు రోజు నిధులు తగ్గిస్తూ ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. కార్మిక ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తూ జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన మే 20న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక వర్గ కర్తవ్యంగా భావించి ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టపల్లి సైదులు, దండా వెంకటరెడ్డి, ఎం.రాంబాబు, వేల్పుల వెంకన్న, కందాల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రైజింగ్ యంగ్ ఇండియా విద్యాశాఖ సారథ్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదాడ మండల విద్యాధికారి సలీంషరిష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్యం ఆట, పాట, మాట, మంచి నడవడికతో గడపాలని కోరారు. విద్యార్థులు ఉల్లాసంగా విజ్ఞానంతో వినోధభరితంగా సెలవులను సద్వినియోగపర్చుకోవాలని కోరారు. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరానికి హాజరు కావాలని, శిక్షణకు వచ్చే విద్యార్థులకు అల్పహారం అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు వివిధ విభాగాలలో ప్రావీణ్యత కలిగిన వాలంటీర్లతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్కేండేయ, ఉపాధ్యాయులు మీనాక్షి, శ్రీనివాసరెడ్డి, పద్మావతి, ఖాజా మియా, జానకిరామ్, బడుగుల సైదులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## సఖి కేంద్రం సందర్శన

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని మంగళవారం ఉమెన్ కమిషన్ సభ్యురాలు, డాక్టర్ కొమ్ము ఉమాదేవి సందర్శించారు. సఖి సెంటర్‌లో కేసుల వివరాలు, తదితర అంశాలపై అక్కడ ఉన్న ఉద్యోగులతో చర్చించారు. కేంద్ర సర్వీస్‌లకు సంబంధించిన ఫార్మెట్‌ను ఆమె మహిళ శిశు సంక్షేమ జిల్లా అధికారి కె.నర్సింహరావుతో కలిసి విడుదల చేశారు. ఈ అంశాలపై ఆమె వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. సఖి కేంద్రానికి వచ్చే వారి కేసులను తక్షణమే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హేమలత, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య, సఖి కేంద్రం కౌన్సిలర్ శైలజ, మహిళ సాధికారిత జెండర్ స్పెషలిస్టు కుక్కడపు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో పనిచేయాలి



**ప్రజాపక్షం/మునగాల:** కూలీలు ఉపాధి హామీ పనులు నాణ్యత ప్రమాణాలతో పనిచేస్తే ఎక్కువ కూలీ డబ్బులు పొందవచ్చని, పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జడ్పి సిఇవో, మండల ప్రత్యేక అధికారిణి శీరిష అన్నారు. మంగళవారం మండలంలోని ఆకుపాములు, ముకుందాపురం, కోదండరామాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం రెండు గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. మొక్కలు చనిపోయిన వెంటనే అదే ప్రదేశంలో కొత్త బ్యాగులలో మొక్కలను నాటాలని సూచించారు. ఎండలలో మొక్కలు చనిపోయే ప్రమాదం ఉన్నందున వాచర్లు ఎప్పటికప్పుడు మొక్కలను పర్యవేక్షించి వాటిని కాపాడాలని కోరారు. అనంతరం ఆకుపాముల, ముకుందాపురం గ్రామాల్లోని గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఎపీవో శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగరాజు, ముత్తయ్య, కవిత, జానకి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజ ప్రియదర్శిని మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/కోదాడ:** జస్టీస్ గిరిజ ప్రియదర్శిని మృతి న్యాయవాది రంగానికి తీరనిలోటు అని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ కోర్టు ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎన్నో సేవలందించారని అన్నారు. ఆమె విశాఖ జిల్లాలో జన్మించి, వివాహం అనంతరం లా డిగ్రీ చేసిందని, న్యాయవాదిగా నమోదు చేసి, జిల్లా న్యాయమూర్తిగా ఎంపికై వివిధ జిల్లాలో ఎనలేని సేవలందించారని అన్నారు. సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తేవడంలో స్టేట లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో తనదైన ముద్ర వేశారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆన్‌లైన్‌లో కేసులు విని, తీర్పులిచ్చారని అన్నారు. ఆమె అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసందన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు రామిశెట్టి రామకృష్ణ, ఉయ్యాల నర్సయ్య, కొడూరి వెంకటేశ్వరరావు, పాలేటి నాగేశ్వరరావు, సాధు శరత్‌బాబు, ఈదుల కృష్ణయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, చలం, నవీన్, మురళి, ధనలక్ష్మి, దొడ్డా శ్రీధర్, రామారావు, నాళం రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో పార్టీ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షునిగా మల్కాపురం గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ యాదవ్ నియమకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్షునిగా నియమించి, తనకిచ్చిన బాధ్యతలను అంతకరణ శుద్ధితో నిర్వహిస్థనాని తెలుపుతూ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, ఎల్లవేళలో అందుబాటులో ఉండి కార్యకర్తల సమన్వయంతో పార్టీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు.

## డైమండ్ యూత్ ఆధ్వర్యంలో కిరణ్ రెడ్డి జన్మదినం




**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన మాజీ ఛైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి జన్మదిన సందర్భంగా డైమండ్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో మొగిలిపాక గ్రామం నుండి వలిగొండ వరకు సుమారు 100 మందితో బైక్ ర్యాలీ చేసి వలిగొండ ప్రభుత్వ ఆసుపత్రి, రాజీవ్ గాంధీ చౌరస్తా దగ్గర కేక్ కటింగ్ చేసి పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, తుమ్మల వెంకట్ రెడ్డి, మండల పార్టీ టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ అఫ్రాజ్, మొగిలిపాక గ్రామ శాఖ అధ్యక్షులు భీమనబోయిన భిక్షపతి, డైమండ్ యూత్ అధ్యక్షులు జడిగే స్వామి, గ్రామ సర్పంచ్ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ ఉప సర్పంచ్ నరసింహ, డైమండ్ యూత్ సభ్యులు కిరణ్ రెడ్డి, అభిమానులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సాయి వర్షిత్‌ను అభినందించిన రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలో మునుగోడు మండల కేంద్రానికి చెందిన దుబ్బ విజయభాస్కర్, రాదల కుమారుడు సాయి వర్షిత్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. సాయి వర్షిత్ ను మంగళవారం హైదరాబాదులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసంలో ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించినందుకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పై చదువుల కొరకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని విద్యార్థికి హామీ ఇచ్చారు. పాల్వాయి జితేందర్ రెడ్డి, ఎండి అన్వర్, పందుల నరసింహ,దుబ్బ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్** : ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండలో 2025/26 విద్యా సంవత్సరానికి డీగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనదని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ శ్రీనివాస రాజు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కళాశాల అన్ని సౌకర్యాలు కలిగి పిహెచ్డి, నెట్, సెట్ లాంటి అర్హత కలిగి అనుభవజ్ఞులైన కళాశాల బోధన సిబ్బంది, డిజిటల్,వర్చువల్ క్లాస్ రూమ్ లు మాత్రమే కాకుండా విశాలమైన తరగతి గదులు, అత్యాధునికమైన లాబరేటరీలు, పూర్తిగా డిజిటలైజేషన్ చేయబడి 25 వేల పైచిలుకు పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పుస్తకాలు కాకుండా ఉర్దూ మీడియం విద్యార్థినులకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు అతిపెద్ద జిమ్, క్రీడా ప్రాంగణం, ఉచిత బస్సు పాస్ సౌకర్యం తో పాటుగా ఎస్సి, ఎస్టి,బీసీ విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కూడా అందుబాటులో ఉన్నదని, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు ఆసక్తిగల విద్యార్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకొని కళాశాలలో చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. 7799910222,7799668960 మొబైల్ నెంబర్లపై సంప్రదించాలని కోరారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు జరుగుతుందని, అందులో భాగంగానే లబ్ధిదారుల ఆవాస గృహాలు వారి పరిస్థితులు పరిశీలించడం జరుగుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. వీరారెడ్డి తెలిపారు. మంగళవారం తుర్కపల్లి మండలంలోని తుర్కపల్లి మండల కేంద్రంతో పాటుగా, వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సూపర్ చెక్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం వీరారెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ డి.వెంకటేశ్వర్లు, తుర్కపల్లి పంచాయతీ కార్యదర్శి శైలజ, వాసాలమర్రి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, డిప్యూటీ తాసిల్దార్ కల్పన, ఆర్ఐ జహంగీర్, ఏఎస్ఓ శ్రీనివాస్, ఏవో ఉమాశ్రీ, ఏఈఓ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఇండ్లు లేని పేద కుటుంబాలను గుర్తించి పార్టీలకతీతంగా పారదర్శంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించాలని కోరుతూ బిజెపి చండూరు మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. గ్రామాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా, పేదలకు కాకుండా అధికార పార్టీ నాయకులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో అనర్హులకు మంజూరు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో నిజమైన పేద కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో రి వేరిఫికేషన్ చేసి నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా చూడాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాలలో అధికార పార్టీ నాయకులే ఇందిరమ్మ ఇండ్లు పెట్టుకొని పేద ప్రజలను గాలికి వదిలేయడం సిగ్గుచేటని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకే ఇండ్లు కేటాయించాలని లేని యెడల బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆంజనేయులు హెచ్చరించారు.

## అందాల పోటీలను ప్రతిఘటిద్దాం



**ప్రజాపక్షం/వలిగొండ** : స్త్రీల ఆత్మ గౌరవాన్ని భంగ పరిచే అందాల పోటీలను ప్రతిఘటించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు. మంగళవరం ఐద్వా సభ్యత్వ క్యాంపియన్‌ను వలిగొండ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో గొప్పగా ప్రారంభం చేస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు వందల కోట్ల రూపాయలు ఏరకంగా ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న మహిళల దాడులు, హత్యలు విషయంలో ప్రభుత్వం ఎందుకు సక్రమంగా చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అప్పులు పుడతలేవని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దుబాయ్‌తో పోటీ పడి హైదరాబాద్‌లో నిర్వహించడం వల్ల ఏం ఉద్ధరిస్తారని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు కర్నాటి మత్స్యరాణీ, పట్టణ కార్యదర్శి గర్దాసు నర్మద, సహాయ కార్యదర్శి కూర మంగమ్మ, నాయకులు వేముల లలిత, ఉంద్రాటి నాగలక్ష్మి, సిర్పంగి స్వప్న, ఐలమ్మ, నర్మద పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రోత్సాహక సాయం

**ప్రజాపక్షం/మోటకొండూరు** : మోటకొండూరు మండలం, అమ్మనబోలు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన పదవ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆలేరు సింగిల్ విండో డైరెక్టర్ బీస కృష్ణంరాజు విద్యార్థులను శాలువాతో సన్మానించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన సాయిప్రసన్నకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన నవ్యశ్రీకు రూ.5,000 నజరానా ప్రకటించారు.ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని, పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నవనీత, గ్రామ నాయకులు పోలేపల్లి స్వామి, బబ్బురి సత్యనారాయణ, యాగమటి వెంకటరెడ్డి, బయాలజీ ఉపాధ్యాయుడు వడ్డేపల్లి సుదర్శన్, హింది ఉపాధ్యాయుడు శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు సాయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కొప్పులు సంపత్, దోమలపల్లి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన సింగపంగా మల్లయ్యల కుటుంబాలకు మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం,మాదిగ సంఘాల జెఏసి తరపున పరామర్శించి వారి పార్థీవ దేహాలకు ,పూలమాల వేసి నివాళ్ళు అర్పించి, ఇరువురి కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తము రూ.5 ఐదువేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈకార్యక్రమంలో మాదిగ సంఘాల జెఏసి రాష్ట్ర కన్వీనర్ కరణ్ జయరాజ్,జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల లక్ష్మయ్య, మహిళా అధ్యక్షురాలు దుబ్బ రూప,అశోక్ సుందర్,ఉపాధ్యక్షులు కత్తుల తులసీదాస్,కోశాధికారి చింత శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు పెరిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామనికి చెందిన చక్రాల అశోక్‌కు మంజూరైన రూ.27వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు అందచేసి మాట్లాడారు. పార్టీలకతీతంగా తమ ప్రభుత్వం పేదలకు సేవలను అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, తిప్పన రవీందర్‌రెడ్డి, మంద సైదులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పరశురాములు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల జాయింట్ యాక్షన్ కమిటి ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది పరశరాములు గౌడ్ నియమితులై మంగళవారం జాయింట్ యాక్షన్ కమిటి జిల్లా అధ్యక్షులు కిష్టప్ప చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్మి బాద్యతను అప్పగించిన జిల్లా అధ్యక్షులు కిష్టప్ప, సంస్థకి పరశరాములు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు జరుగుతున్న రోడ్డు పనులను ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పరిశీలించారు. మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో చెక్ డ్యామ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు, కార్యదర్శులు యాస లక్ష్మారెడ్డి, ముద్దసాని సిద్ధులు గౌడ్, మండల నాయకులు జె.నగేష్, పి.మల్లేశం, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/దేవరకొండ;** క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని దేవరకొండ మండల విద్యాధికారి మాతృ నాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో వేసవి క్రీడా క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి క్రీడా శిభిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిగర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రెబక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** మండలంలోని పలుగు తండాలో జరిగిన వివాహ కార్యక్రమంలో బిఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు,దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామవత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి,బొడ్డుపల్లి మహేందర్,శ్రీను ఉన్నారు.



## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మార్కెట్ సెంటర్ లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మోత్కూర్ భువనగిరి మెయిన్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో లారీలను సరిపడ పంపి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా ధాన్య కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ యాస ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు కోరే బిక్షపతి, మాజీ ఎంపిటిసి యాస కవిత, మండల సెక్రెటరీ కొండపల్లి అబ్బసాయిలు, మాజీ సర్పంచ్, కోల సత్తయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోరే వెంకన్న, కొమ్మరాజుల శ్రీను, కోరే బీరప్ప, నాతి స్వామి, ఎలగందుల విజయ్ యువజన నాయకులు, పంజాల రాజు, నాతి వినయ్, గడ్డం సతీష్, శ్రీనివాస్ రెడ్డి లోడి మధు, మల్ల క్రాంతి, శిగ మల్లేష్ పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా మేకలు మృత్యువాత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అనుమానాస్పదంగా 8 మేకలు మృత్యువాత పడిన సంఘటన భూదాన్ పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు గాలి రంగయ్య 6, గుండె హంసమ్మ 2 మేకలు మొత్తం 8 మేకలు చనిపోయినట్లు తెలిపారు. రోజువారీగా మేకలను మేత కోసం వెళ్ళినట్లు వరి కోసిన పంట పొలంలో నీళ్లు తాగి అకస్మాత్తుగా మేకలు ప్రాణాలు విడిచిపోయినట్లు బోరున ఏడుస్తూ చెప్పారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## ఓంకార్ శతజయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 12 వరంగల్ జిల్లా వాదాపూర్‌లో నిర్వహించే ఎంసీపీఐయూ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దికాయల ఓంకార్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో ఓంకార్ శతజయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఓంకార్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని భూస్వాముల దోపిడికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, ధీరావత్ మోహన్‌నాయక్, జ్యోతి, కిరణ్, ఇమ్మానియేల్, రవి, వీరన్న, సందీప్, శారద, సాలమ్మ, శ్రీనునాయక్, మచ్చ సైదులు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## చుంచు నర్సయ్య మృతి పార్టీకి తీరని లోటు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చుంచు నరసయ్య మృతి పార్టీకి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో అనారోగ్య కారణంగా మృతి చెందిన చుంచు నరసయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, కొరటికల్ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కోర బిక్షపతి, బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు యాస ఇంద్రారెడ్డి, మోత్కూరు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నరకుడు బిందెల సైదులు, మాజీ సర్పంచ్ కోడిమాల యాదగిరి గౌడ్, సెక్రెటరీ జనరల్ చుంచు శ్రీనివాస్ పాల్గొన్నారు





## వార్డు కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** టీడీపీ పట్టణంలోని వార్డుల్లో వార్డు కమిటీలను వేయడం జరుగుతుంది. అందులో భాగంగా మంగళవారం పట్టణంలోని 33వ వార్డు కమిటీని టీడీపీ జాతీయపార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చారిజ బంటు వెంకటేశ్వర్లు సమక్షంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మండవ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పట్టణ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, మైనార్టీ నాయకులు నసీరొద్దిన్ బాబా కమిటీని ఎన్నుకున్నారు. 33వ వార్డు అధ్యక్షుడిగా ఎండి.నజీమొద్దిన్, ప్రధాన కార్యదర్శిగా సాయిభరత్, సహాయ కార్యదర్శిగా మీర్జాబాబా, కోశాధికారిగా మొన్నిసాబేగం, కార్యదర్శులు ఎస్‌కె.లతీఫ్, సంతు మింగు, వెంకన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలకల వెంకన్న, గర్దాస్ ప్రభాకర్, కస్తూరి సత్యనారాయణ, బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్న ప్రైవేట్ పాఠశాలల ప్రచారం

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రైవేట్ పాఠశాలలు ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్నాయని బిఆర్ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## సన్నవరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/గుండాల;** ఐకేపి, పిఏసిఎస్ నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గుండాల మండల తహశీల్దార్ నీలిమకు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నూనెగూడెం ఐకేపి సెంటర్‌లో 80 బస్తాల సన్న ధాన్యం పోసీ ఆరబెట్టి 15 రోజులు దాటిన గన్నీ బ్యాగులు ఇచ్చి తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరి ధాన్యానికి 500 బోనస్ ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల తర్వాత సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తామని యాసంగి సన్నధాన్యం కొనుగోలు చేయమని చెప్పడం రైతులను మోసగించడమే అని విమర్శించారు. మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో సన్నధాన్యాంను కొనుగోలు చేసేలా అనుమతులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హేమ మానస సమక్షములో ఆశడే మీటింగ్ నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో డాక్టర్ లు అన్ని గ్రామాల ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు. డాక్టర్ హేమమానస అన్ని ప్రోగ్రాం పై ప్రక్షాళన చేస్తూ గర్భిణీ స్త్రీలను ఎర్లీ రిజిస్టేషన్ గర్నమెంట్ హాస్పటల్ కాన్పులు కావాలి అన్నారు. టీబి అనుమానిత వారికి స్పుటం తీసుకుని పరీక్షలు చేయించాలి అని, లెప్రసీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి మందులు అందే విధముగా చూడాలని అన్ని సీజనల్ వ్యాధులు అవగాహన కల్పించాలి అని అన్ని ప్రోగ్రామ్స్ లో 100% శాతము నివేదికలు సాదించాలి అని తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెలెన్ అక్కమ్మ, చంద్రన్న, అనూష, సంధ్య వీణసాయి ,ఎఎన్ఎం,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ మాట్లాడుతూ పశువులలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సుమారు 225 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఏ రాజు, గోపాల మిత్రలు గోవింద్, కృష్ణ, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ ఇంజనీర్లకు మండలాల కేటాయింపు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-హౌజింగ్ శాఖ విధుల్లో చేరిన 14 మంది ఏఈలు**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హౌజింగ్ శాఖ బలోపేతం చేస్తూ అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఖమ్మంజిల్లాకు ప్రభుత్వం కేటాయించిన 14 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు మండలాలు కేటాయింపు చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తెలంగాణ స్టేట్ హౌజింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ ఖమ్మం విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీర్లను కేటాయించిందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నూతన ఏఈలు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలానికి డి. నగేష్, నేలకొండపల్లి మండలానికి వి. లింగ, రఘునాథపాలెం మండలానికి జి. పుష్ప, చింతకాని మండలానికి టి. సుప్రియ, తల్లాడ మండలానికి షేక్ అస్మా, ఏన్కూరు మండలానికి బి స్నేహ, కల్లూరు మండలానికి ఎన్. సాయిపవన్, వేంసూరు మండలానికి ఎం. శ్రీనివాస్, ముదిగొండ మండలానికి బి. సతీష్, ఎర్రుపాలెం మండలానికి పి. గోపి, సత్తుపల్లి మండలానికి వి. పవన్‌కళ్యాణ్, పెనుబల్లి మండలానికి వై. కమల్ ప్రసాద్, కూసుమంచి మండలానికి ఎ. రవి, తిరుమలాయపాలెం మండలానికి కె. మిథున్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్లను కలెక్టర్ కేటాయించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు వెంటనే రిపోర్టు చేయాలని, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఇందిరమ్మ ఇండ్ల బాధ్యతలను అప్పగించాలని, వారి పనితీరును పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ భూక్యా శ్రీనివాస్, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజవరకూ కొనుగోలు చేస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రైతులు ఆందోళన చెందవద్దని నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగులో చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో ధాన్యం శుభ్రపరిచే యంత్రంతో పాటు, మరి కొందరు రైతులు ట్రాక్టర్‌కు అమర్చిన ఫ్యాన్స్ ద్వారా వడ్లను శుభ్రపరిచే విధానం కలెక్టర్ పరిశీలించారు. రైతులు స్వచ్ఛందంగా నాణ్యమైన వడ్లను తీసుకువచ్చారని, తాలు, తరుగు పేరుతో ఏలాంటి కోత విధించ కూడదని సెంటర్ నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు...ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెరిగిందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ధాన్యం నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎఫ్.ఏ.క్యూ.ప్రమాణాలు రాగానే కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులకు అవరోధాలు లేకుండా సాఫీగా కొనుగోలు ప్రక్రియ కొనసాగేందుకు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయాలన్నారు. ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ సమస్యలు రాకుండా ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలలో సబంధిత అధికారులు, రైతులు ఉన్నారు.

# రైతులను ఇబ్బంది పెటొద్దు

**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వరి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కల్పించి రైతులు నష్టపోకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం కొణిజర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్ద రైతుల ఇబ్బందులను రైతుసంఘం బృందం అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాత్రనకా పగలనకా కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవాలంటే రైతులకు ధాన్యం కొనుగోలు శాపంగా మారిందని పేర్కొన్నారు. ట్రాన్స్ పోర్ట్ లేక ఎండలో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కాంట్రాక్టర్ స్పందన లేకపోవడంతో గాలివానలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు వస్తున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆయనతోపాటు రైతుసంఘం జిల్లా నాయకులు చింతల ఆదినారాయణ, దొంటె సీతారాములు, డి నరసింహారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీషిరిడీ సాయి మందిరం 30వ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణంలోని సాయి నగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయి మందిరం 30వ వార్షికోత్సవ శ్రీబ్రహ్మసూత్రాత్మక శ్రీభవాని శంకర్‌స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవ మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. 1995 సంవత్సరం స్వయంగా స్థల నిర్ణయం చేసిన చోట విగ్రహ ప్రతిష్ట జరిపి నేటికి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాలాభిషేకాలు, పంచామృత స్నానాభిషేకం నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి ఏడు గంటల వరకు బాబా వారికి పంచామృత స్థానాభిషేకం నూతన వస్త్రాలంకరణ హారతి నిర్వహించారు. మందిరంలో భజ బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు బాబా వారి ఉత్సవి గ్రహమునకు శ్రీభవాని శంకర్‌స్వామి వారికి వచ్చిన భక్తులచే పాలాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం 12గంటలకు బాబా వారికి మధ్యాహ్న హారతి నిర్వహించారు. తదుపరి భక్తులకు మందిరంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమానికి 5వ వార్డు మాజీ కౌన్సిలర్ మాదినేని సునీత, రాయల అన్నపూర్ణ, వజినేపల్లి సునీత, రాయల రోజా, రాయపూడి రజిని ప్రారంభించారు. రెండో కౌంటర్ ను ఆలయ కమిటీ కోశాధికారి లగడపాటి బోసు, మందిర కమిటీ సభ్యులు తల్లపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి, మాదినేని దుర్గాప్రసాద్, మిద్దె సుబ్బారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, మోహన్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ అభిషేక కార్యక్రమాల్లో శ్రీరామనేని శ్రీనివాసరావు, నల్లమోతు లక్ష్మీ నారాయణ, చెరుకూరు శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, కోసూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే పాయం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా మంగళవారం అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అశ్వాపురంలోని ఒరుగంటి వీరయ్య భవన్ నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు నిర్వహించి మీడియా ముఖంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు ఒరుగంటి భిక్షమయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, స్వాభిమానుడు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు వారి కుటుంబాలు సకల సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్పూర్తిగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు నాయకులు, మండల ప్రజల తరపు నుండి కోరుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన అశ్వాపురం ప్రెస్ క్లబ్..**


పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదిన సందర్భంగా అశ్వాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మణుగూరులోని క్యాంప్ ఆఫీస్(ప్రజాభవన్)లో ఎంఎల్ఏ పాయంను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెలమ రాజేందర్ మండలంలోని జర్నలిస్టుల యొక్క సమస్యలను వివరించారు. పాయం వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ములకలపల్లి గోపీనాథ్, పర్సబోయిన రాధాకృష్ణ, గరికపాటి అంజన్‌రావు, గొల్లపల్లి నరేష్, నాగరాజు, సాధు అర్జున్, దేవారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టియూసి అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/చింతకాని :** ఐఎన్‌టీయూసీ చింతకాని మండలధ్యక్షుడిగా రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు మంగళవారం శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలను కలుపుకుని కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తానన్నారు.

# మొక్కజొన్న దగ్ధం



**ప్రజాపక్షం/చింతకాని :** మంగళవారం సాయంత్రం చింతకాని మండలంలో వచ్చిన గాలి దుమారం నర్సింహాపురం రైతులకు కన్నీరు మిగిల్చింది.పొలాల్లో రైతులు పెట్టిన నిప్పు గాలి దుమారానికి గ్రామంమీదకి పాకింది. దీంతో గ్రామచివరన రైతు వడ్డె వంశీ కృష్ణ కు చెందిన మొక్కజొన్న పూర్తిగా దగ్ధమైంది. సుమారు 200 క్వింటాళ్ల మొక్కజొన్న పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఫైర్ ఇంజన్ కు సమాచారమిచ్చినా సమయానికి చేరుకోక పోవడం తో పంట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. 5 లక్షల పంట నష్టపోయినట్లు రైతు వంశీ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు.పక్కనేఉన్న రైతు అచ్చయ్య కు చెందిన 100 క్వింటాళ్ల మొక్కజొన్న , బైక్ అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం 7లక్షల పంట నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు లో తుడుం కృష్ణకి చెందిన ధాన్యం రూ. 50 వేల నష్టం జరిగింది. మోతారపు వెంకటేశ్వర్లు కు చెందిన మొక్కజొన్న వరి ధాన్యం కు మంటలు అంటుకోవటంతో సమీప రైతులు గ్రామస్థులు అక్కడకి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# ప్రెస్ క్లబ్ సీనియర్స్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రమైన జూలూరుపాడులో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా, ఎల్‌హెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ సీనియర్స్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సీనియర్స్ నూతన అధ్యక్షునిగా కొలిపాక చంద్రశేఖర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా, ప్రెస్ క్లబ్ సీనియర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంచలనాత్మకమైన వార్తలను సేకరిస్తూ, ప్రజలు, అధికారుల మన్ననలను పొందుతున్న సీనియర్స్ ప్రెస్ క్లబ్ మిత్రులకు అభినందనలు తెలిపారు. ఇదే క్రమంలో ముందుకు సాగుతూ ప్రజలు, అధికారుల మనలను పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బానోత్ ధర్మ, లాకావత్ నాగేశ్వరరావు, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్ పాల్గొన్నారు.

# ఏసిపి, తహశీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/వైరా:** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశానుసారం వైరా టౌన్ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ, వైరా రూరల్ అధ్యక్షులు దోసపాటి కళ్యాణ్ ఆధ్వర్యంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణ రాష్ట్రంలో చొరబడి అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను గుర్తించి వారి స్వదేశాలకు పంపించాల్సిందిగా కోరుతూ వైరా తహశీల్దార్‌కి, వైరా ఏసిపికి, వైరా పోలీస్‌స్టేషన్ నందు వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది.

# ప్రయోగాత్మక ఫలితాలను అందించండి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రయోగాత్మకంగా వచ్చిన ఫలితాలను రైతులకు అందించి వ్యవసాయాభివృద్ధికి చేయూతనివ్వాలని వ్యవసాయ విద్యార్ధులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రయోగ విద్య ఎంతో దోహదపడుతుందని చెప్పారు. స్థానిక వ్యవసాయ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మామిడి, మునగ, పామ్ పాండ్‌లను పరిశీలించారు. విద్యార్ధులతో సాగు పద్దతులపై చర్చించారు. క్షేత్ర సందర్శణ, దత్తత గ్రామాల్లో చేపట్టే సామాజిక కార్యక్రమాల్లో రైతులను కలవాలని వ్యవసాయ పద్ధతులతో పాటు ముఖ్యంగా పామ్ పాండ్ ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి లేకుండా భూగర్భ జలాల పెంపుకు ప్రజలతో పాటు రైతులు సామాజిక బాధ్యతగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వీటి ఫలితాలు వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయడం కాకుండా వివిధ అంతర్ పంటలు సాగు ద్వారా ఆర్థిక నష్టాల నుండి బయటపడవచ్చునని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సిరులు కురిపించే మునగ సాగును ప్రోత్సహిస్తున్నామని, ఆకులను పొడి చేసి ఆదాయం పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 5వేల ఎకరాల్లో మునగ సాగు అవుతుందని, భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలకు మునగ ఎగుమతి చేసే స్థాయికి జిల్లా చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, ఎడిఎ రవికుమార్, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఇజిఎస్ ఎపిఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

**అశ్వారావుపేట మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన...**

మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పట్టణ సమీపంలోని 911, కన్నాయిగూడెంలోని 152 సర్వే నెంబర్లను పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖలతో సంయుక్తంగా జాయింట్ సర్వే పూర్తి కావటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన గిరిజనులకు కొత్త హక్కు పట్టాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. గోగులపూడిలో వెదురు బొమ్మలను పరిశీలించి కళాకారులతో ముచ్చటించారు. వీరికి ప్రభుత్వం నుండి ఆర్థిక వెసులుబాటు కల్పించటానికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని ప్రకటించారు. గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఐటిడిఏ ద్వారా నిర్మించిన వ్యాపార సముదాయాలను సందర్శించారు. దుకాణాల ద్వారా ఆదాయ వివరాలను గిరిజన వ్యాపారుల నుండి సేకరించారు. ఆయన వెంట తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ ఏర్పాటు చేయాలి

**- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని**




**ప్రజాపక్షం / పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసి సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధి జగన్నాధపురంలోని ముంతాజ్ ఫంక్షన్ హాల్ నందు ఎలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రూ.19 కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూములు నష్టపోయి కాలువలు తీసినారు అయినా జిల్లాకి నీరు ఇవ్వటానికి కావాలిసిన డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణం చేపట్టకపోతే జిల్లా ఎండిపోయే అవకాశం ఉందని అన్నారు. జిల్లా నుండి నీరు పోతున్న జిల్లాకు చుక్క నీరు లేకపోతే జిల్లా ప్రజలు చూస్తూ ఊరుకోవాలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాకి అన్యాయం జరుగుతుంటే తెలంగాణ రైతు సంఘం చూస్తూ ఊరుకోదని, దీనిపై ఈ నెల 20వ తేదీ వరకు గ్రామ గ్రామాన సభలు పెట్టి ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు మండల స్థాయి ధర్నాలు నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, నాయకులు ధర్మ, లక్ష్మి నారాయణ, రవికుమార్, సత్యనారాయణ, తిరుపతిరావు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వినోద్, శ్రీనివాసరావు, వెంకట్రావు, రామారావు, శంకరయ్య, సమ్మక్క తదిరుతు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి



**ప్రజాపక్షం/కల్లూరు:** మండలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బందితో కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు డి ఈ రాములు తెలిపారు. మండల పరిధిలోని కొర్లగూడెం రైతు వేదికలో విద్యుత్ భద్రత పై సలహాలు సూచనలు ప్రమాదాలు నివారణ కు సిబ్బందిచే ప్రతిజ్ఞ జరిగింది. విద్యుత్ భద్రత కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన విద్యుత్ సిబ్బంది కు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవలంబించవలసిన విద్యుత్ భద్రత సూచనలు, ప్రమాదాలు నివారణకు సలహాలు, సూచనలు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యుత్ భద్రత వినియోగం పొదుపుపై మండల పరిధిలోని పలు గ్రామాలలో వారం రోజులు పాటు కరపత్రాలను పంచుతూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ప్రమాదాల నివారణకు ఎల్ సి యాప్ అందుబాటులోకి తెచ్చామని ప్రమాదాలు జరగకుండా సిబ్బందికి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డి ఈ రాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ సతీష్, ఏఈలు ఉమాకాంత్, ప్రసాద్, కృష్ణ కాంత్,వెంకట్, రామ్‌రెడ్డి, రవితేజ, భజేంద్ర కుమార్ తోపాటు సత్తుపల్లి డివిజన్లోని పెనుబల్లి, తల్లాడ సబ్ డివిజన్, పరిధిలో విద్యుత్ కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో జిఐఎస్ పాత్ర కీలకం




**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్ :** నిత్య జీవితంలో జిఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం)పాత్ర ఎంతో కీలకమని ముంబై జిఐఎస్ సబ్జెక్ట్ నిపుణులు అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం బృందం జిల్లాలో పర్యటించింది. ఈమేరకు పాల్వంచలోని అనుబోస్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జిఐఎస్ ద్వారా పలు రకాల మ్యాప్‌లు తయారు చేయవచ్చని, అదే విధంగా ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో కూడా ఉపయోగించవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ముంబై ఐఐటి ద్వారా ఇంటర్ షిప్ చేసే విధంగా ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, మెడికల్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హాజరు కానున్నారన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.

## 8న ఖమ్మంలో జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల ఎనిమిదిన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మాధవి తెలిపారు. ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో పని చేయుటకు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు ఐటిఐ అర్హత కలిగిన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని తెలిపారు. 550 ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన



**ప్రజాపక్షం/భద్రాచలం :** రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు భద్రాచలం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల పర్యటన అనంతరం మ. 1 గం.కు చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయితీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. లక్ష్మి కాలనీలో గల నూతన గ్రంధాలయ భవనం ప్రారంభించిన అనంతరం, తేగడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 3 గం.లకు దుమ్ముగూడెం మండలంలోని చిన్నబండిరేవు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శంఖుస్థాపన, సిసిరోడ్డను ప్రారంభించనున్నారు. సా.4.15కి సింగవరంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. సా.4.45 కి భద్రాచలంలోని చర్లరోడ్‌లో సిసి రోడ్లు, డ్రైన్లు ప్రారంభిస్తారు. 5 గం.లకు బాలికల ఆశ్రమ పాఠశాల డైనింగ్ హాల్ ప్రారంభిస్తారు. తాతగుడి సెంటర్‌లోని గ్రంధాలయంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

## ప్రభుత్వ ఫథకాల అమలు వేగవంతం కావాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల అమలు జిల్లాలో వేగవంతం కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని అధికారులతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు వారంలోగా చేయాలన్నారు. పామ్‌ఫాండ్ నిర్మాణాలు వానం కాలం కల్లా చేపట్టారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల జాబితా త్వరితగతిన పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంతకం చేసిన జాబితాను ప్రతీ రోజు వార్డు, గ్రామ, మండల స్థాయి నివేదికలను అధించాలన్నారు. పూర్తి అయిన జాబితాను ఇంచార్జ్ మంత్రి అనుమతి కోసం ప్రతీ రోజు పంపాలని అధికారులను ఆదేశించారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా మంగళవారం ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, స్వావాభిమనుడు ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు వారి కుటుంబాలు సకల సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు నాయకులు, మండల ప్రజల తరపు నుండి కోరుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, పెండకట్ల పాపారావు, కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఎండి అత్వార్, యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, ఊకే ఎర్రయ్య, కొరస నాగేశ్వరరావు, ఊల్లోజు భరత్, ముప్పారపు రాము, సునీత, తులం ముత్తిలింగం, మోకాళ్ళ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.